# ట్రిపుల్ ఐటీని సాధించాం..

**ఇక పేద విద్యార్థులకు**

**ఐఐఐటీలో సీటు అందించడమే లక్ష్యం**

**వారి కల నిజం చేసేందుకే ఉచిత**

**రెసిడెన్షియల్ శిక్షణ అర్హత పరీక్ష ద్వారా**

**150 మంది విద్యార్థుల ఎంపిక**

**నెల రోజుల పాటు రెసిడెన్షియల్**

**విధానంలో శిక్షణ**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి24 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఆర్థిక పరిమితుల కారణంగా ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం పొందలేకపోతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో, పూర్తిగా ఉచితంగా స్వంత నిధులతో నెల రోజుల పాటు మహబూబ్‌నగరంలోని బోయపల్లిలో ఉన్న వైటిసి భవనంలో రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూ బ్‌నగర్ నగరంలోని బోయపల్లిలో ఉన్న వైటిసి భవనంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గ నిర్దేశం, శిక్షణ లభించక అనేక మంది వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.600 కోట్లతో నిర్మించనున్న ఐఐఐటీ కళాశాల నిర్మాణానికి ఈనెల 16వ తేదీన భూమిపూజ నిర్వహించి, ముందుగా రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మన మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఐఐఐటి కళాశాలలో గత సంవత్సరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఐఐఐటీలో 5 శాతం మంది విద్యార్థులు కూడా అడ్మిషన్ పొందలేకపోయారని, కనీసం ఈఏడాది అయినా 15 నుంచి 20 శాతం మంది విద్యార్థులు ఐఐఐటీలో సీట్లు సాధించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని ఆయన తెలిపారు. ఉత్తర తెలంగాణతో పోలిస్తే , మనం చాలా వెనకబడి ఉన్నామని, ఇప్పుడు మన మహబూబ్‌నగర్ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నారు. కాబట్టి మనం కూడా ఎదగడానికి అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఐఐఐటీ ఉన్న ప్రాంతానికి చెందిన విద్యార్థులే అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలనే ఉద్దేశంతో ఈ నెల 10వ తేదీన నగరంలోని మాడ్రన్ స్కూల్‌లో మెరిట్ (అర్హత) పరీక్ష నిర్వహించామని చెప్పారు. ఈ పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 17 మండలాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 750 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో మెరిట్ ఆధారంగా 150 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి 75 మంది, జడ్చర్ల , దేవరకద్ర నియోజకవర్గాల నుంచి మరో 75 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ శిక్షణ నిమిత్తం ఎస్ఎసి అనుమతులు తీసుకొని, జిల్లా విద్యాశాఖ అధికారులతో చర్చించి నెల రోజుల పాటు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందం ద్వారా ఐఐఐటీ ప్రవేశానికి అవసరమైన విధంగా లోతైన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించబడుతుందని, వసతి, భోజనం, అధ్యయన వసతులు అన్నీ ఉచితంగానే కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఐఐఐటీ వంటి సంస్థల్లో చదవగలరనే నమ్మకాన్ని కల్పించడమే తన లక్ష్యమని, ఒకసారి అవకాశం లభిస్తే వారు తమ ప్రతిభతో దేశస్థాయిలో రాణిస్తారని ఎమ్మెల్యే అన్నారు. గత రెండేళ్లుగా విద్యావిధానంలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతోందని తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం పార్టీలకు అతీతంగా కలిసి పనిచేస్తున్నామని మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి సభ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఒక స్పష్టమైన సంకేతం ఇచ్చామని అన్నారు. గత పదేళ్లలో మహబూబ్‌నగర్‌లో విద్య కోసం తగిన నిధులు ఖర్చు చేయలేదని విమర్శించారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ప్రతి కళాశాలకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. అందులో భాగంగా ఎంవిఎస్ డిగ్రీ కళాశాలకు రూ.30 కోట్లు, బాలుర జూనియర్ -మిగతా3లో..



మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## పీఎం శ్రీ నిధులు ల్యాప్స్ కావొద్దు
# సంపూర్ణంగా వినియోగించాలి

**పాఠశాలకు కావాల్సిన పరికరాలను**

**కొనుగోలు చేయాలి**

**పియం శ్రీ పాఠశాలల హెడ్ మాస్టర్లకు**

**కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం**


పాఠశాలల హెచ్‌ఎంలు, కెజిబివి అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పీఎంశ్రీ పాఠశాలకు మంజూరైన నిధులను సంపూర్ణంగా వినియోగించాలని శనివారం కలెక్టర్ విసి కార్యాలయంలో నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కెజిబివి ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. పీఎం శ్రీ స్కీమ్ పరిధిలో ఉన్న పాఠశాలలలో యోగా, సైన్స్, గణిత ప్రయోగలకు కావలసిన పరికరాల కొనుగోలు, విద్యార్థులకు విజ్ఞాన, పరిశ్రమల అవగాహన పర్యటనలు, కళలు-హస్తకళల వంటి సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాల నిర్వహణ కోసం మంజూరైన నిధులను సమయానికి, సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కేటాయించిన నిధులు ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగం కాకుండా మిగలకూడదని, ల్యాప్స్ కాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. పిఎం శ్రీ కింద 26 పాఠశాలలకు 20 రకాల గ్రాంట్‌లకు సంబంధించిన బిల్లులు సోమవారం నాటికి ఆన్ లైన్ లో సమర్పించాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో అన్ని కార్యక్రమాలు నిర్ణీత కాలవ్యవధిలో సక్రమంగా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులతో నిరంతర సమన్వయం పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు కలెక్టర్ సూచించారు. అవసరమైన మార్గనిర్దేశం అందిస్తూ పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, పి. ఏఓ యాదగిరి, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితర అధికారులు పాల్గొన్నారు.


కార్యాలయాల వద్ద క్యూలైన్లో నిల్చున్న రైతులు

## యూరియా కోసం
# రైతుల అగచాట్లు

**బిజినేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త:** యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. డిమాండ్‌కు తగిన యూరియా సకాలంలో రాకపోవడంతో రైతులు తెల్లవారుజాము నుండే యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. శనివారం తెల్లవారుజామునే బిజినపల్లి మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం వ్యవసాయ కార్యాలయాలు, సొసైటి కార్యాలయాలు, ఎరువుల దుకాణాల చుట్టూ క్యూలైన్లలో నిలుచున్నారు. రైతులు చలికి వణుకుతూ యూరియా కోసం బారులు తీరారు. క్యూలైన్ల వద్ద తోపుతాట జరగడంతో పలువురు రైతులు కిందపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి తోపులాట జరగకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఒక్కో రైతుకు పంటల ఆధారంగా యూరియాను పంపిణీ చేశారు. కొంతమందికి యూరియా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. పాస్ బుక్కులో పది ఎకరాలు ఉన్నా రెండు సంచులే ఇస్తే, ఏం చేసుకుంటామని, పొలాన్ని బట్టి యూరియా ఇవ్వాలని అన్నారు.

# జి రామ్ జి తోనే గ్రామాల అభివృద్ధి

**పని దినాలు పెంచిన కేంద్ర ప్రభుత్వం**

**ఉపాధి, మౌలిక వసతుల కల్పన**

**పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ**


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**చిన్నచింతకుంట, జనవరి 24 ప్రభాతవార్త :** వికసిత్ భారత్ జి.రాం.జీ పథకం తోనే గ్రామాల అభివృద్ధి తోపాటు ఉపాధి కల్పన జరుగుతుందని మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. శనివారం మండలంలోని పర్దీపూర్ గ్రామంలో వికసిత్ భారత్ జి రామ్ జి పథకంపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకంలో మార్పులను తీసుకొస్తూ వ్యవసాయ రంగంతో పాటు మౌలిక వసతుల కల్పనకు గాను వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈపథకంలో 125రోజులకు పనిదినాలు పెంచడం జరిగిందన్నారు. గ్రామ సభను నిర్వహించి ప్రజల సమక్షంలో గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తీర్మానం చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించిందన్నారు. కోట్ల రూపాయల పనులు కల్పించిన గ్రామాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదని, కేంద్ర ప్రభుత్వం ఈ మార్పులు తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులను ఏమాత్రం తగ్గించకుండా అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 40 నిధులు కేటాయిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గిస్తుందని కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను సృష్టిస్తూ ప్రజలను గందరగోళాన్ని సృష్టించిందన్నారు. జి రాంజీ పథకంలో వ్యవసాయ రంగాన్ని కూడా అనుసంధానం చేసిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఈ పథకంలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. వందరోజుల పని దినాలను 125 రోజులకు పెంచడంతో కూలీలకు అదనంగా పనులు దొరుకుతాయన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు తగ్గవని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్న సదుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకంలో మార్పులు చేసిందన్నారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలన్నారు. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరి వివరాలు కేంద్రానికి పంపకపోవడంతోనే కిసాన్ సమ్మాన్ నిధి కింద వ్యవసాయానికి ఆర్థిక సహాయం అందడం -మిగతా3లో..


ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

# రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

**వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 24 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు పక్షపాతిగానే పనిచేస్తుందని రైతు రుణమాఫీ, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, రాయితీపై విత్తనాల లాంటి అనేక ఉపకరణాలను రాయితీపై అందిస్తుందని వీటి ద్వారా రైతులకు దాదాపు రూ.20వేల నుంచి 50వేల రూపాయలవరకు లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకారణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 10ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులు రైతుల పేరున అనేక మోసాలు చేశారని, అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ రాయితీ వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం అని అన్నారు. కేవలం రైతుబంధు పేరుతో రైతులకు లక్షల రూపాయలు ఆదా అయ్యే ఇలాంటి వ్యవసాయ ఉపకరణాలపై రాయితీలను ఎత్తేసి కేవలం రైతుబంధు పేరుతో ఆడంబరాలు ప్రచారాలు చేశారేతప్ప వారు రైతులకు చేసింది ఏమీ లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటినుంచి అన్నదాతల - మిగతా4లో..


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## జిల్లాలో సోషల్ ఎకనామిక్
# డెవలప్‌మెంట్ స్కీం సర్వే

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట, జనవరి 24 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థంగా అందుతున్నాయా లేదా అన్న అంశంపై పేట జిల్లాలో సోషల్ ఎకనామిక్ అండ్ డెవలప్మెంట్ స్కీం సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆల్ ఇండియా సర్వీసెస్ మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ - మిగతా4లో..

# మావోయిస్టు కీలక నేతలు అరెస్టు

**సీపీఐ (మావోయిస్టు) క్యాడర్‌తో పాటు, ఫ్రంట్ సంస్థల సభ్యుల పట్టివేత అరెస్టు**


మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 24 ప్రభాతవార్త:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భద్రతా బలగాలపై జరిగిన పలు నేరాలలో ప్రమేయం ఉన్న నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సంస్థకు చెందిన కీలక నేతలతో పాటు అనుబంధ ఫ్రంట్ సంస్థల సభ్యులను అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రాంసింగ్ జి పాటిల్ తెలిపారు. శనివారం సాయంత్రం అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టు కార్యకలాపాలను నల్లమల ప్రాంతంలో మళ్లీ పునరుద్ధరించేందుకు యత్నిస్తున్న సమయంలో మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టైన వారిలో మావోయిస్టు కీలక క్యాడర్ మీసాల సాలమన్ సంతోష్ నాగరాజ్, అతనిభార్య సాన్బట్టి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) సహకన్వీనర్ ఎడ్ల అంబయ్య, సివిల్ లిబర్టీస్ కమిటీ సంయుక్త కార్యదర్శి జక్క బలయ్య, రైతు మాన్నెట్టి యాదయ్యలు ఉన్నారు. ఈ అరెస్టులతో నల్లమల ప్రాంతంలో మావోయిస్టు నెట్‌వర్క్‌ను గణనీయంగా దెబ్బతీశామని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ మావోయిస్టుల నుంచి ఒక కారును, రూ.1,25,000 నగదు, ఏకే47, ఇన్సాస్ ఆయుధాలకు సంబంధించిన లైవ్ రౌండ్లు, రేడియో, జెలటిన్ స్టిక్స్ సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిషేధిత మావోయిస్టు సంస్థలకు - మిగతా4లో..

## క్లియర్, సేఫ్
# సిటీగా మార్చాలి

**నగరంలో క్రైమ్ రేట్ తగ్గింది**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఎస్పీ జానకితో కలిసి 30 సీసీ కెమెరాలు ప్రారంభం**



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 24 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నగరాన్ని క్లియర్ సిటీ, సేఫ్ సిటీగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. 10 నిమిషాల అసౌకర్యానికి 100 సంవత్సరాల జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని, మత్తుకు బానిస కావద్దని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలో ఎస్‌డిఎఫ్ ముడా నిధులతో ఏర్పాటు చేసిన 30సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతనే మహబూబ్‌నగర్‌లో కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడ ఏసమస్య తలెత్తినా వెంటనే గుర్తించి, ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని పరిష్కరించేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్ సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా రహదారుల భద్రతపై ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గత రెండేళ్లుగా నగరంలో క్రైం రేట్ -మిగతా4లో..


వైద్య సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని
# ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**- ఆయుష్మాన్ భారత్ సేవల అమలుపై కలెక్టర్ ఆరా**

**వెల్దండ, జనవరి 24 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన వైద్య సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓపీ నమోదు విభాగం, ల్యాబొరేటరీ, ఇన్‌పేషెంట్ వార్డు, సహా ఇతర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం కింద అందిస్తున్న వైద్య సేవల అమలు తీరుపై ఆరా తీశారు. రోగులకు వైద్యం సక్రమంగా అందుతున్నదీ, అవసరమైన సదుపాయాలు ఉన్నాయా అనే విషయాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన నూతనంగా నిర్మిస్తున్న భవనాలను కలెక్టర్ పరిశీలించి వెంటనే పూర్తి చేసి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ డీఎంహెచ్ఓను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాసుపత్రి వైద్యుల ప్రథమ కర్తవ్యమన్నారు. కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ డిఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, తహసిల్దార్ కార్తీక్ కుమార్, డాక్టర్ సింధు, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**వీబీ జీ రామ్ జీ చట్టాన్ని**

**తక్షణమే రద్దు చేయాలని డిమాండ్**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ**

**స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**


నిరసన కార్యక్రమాల్లో మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**వనపర్తి, జనవరి 24 ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని , వీబీ జీ రామ్ జీ చట్టని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి మండలం, పెద్దగూడెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించాలని, చేపట్టిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నీరుగారుస్తూ, చివరికి పథకానికే స్వస్తి పలకాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అలాగే గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడం అంటే సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లబ్ధికే పరిమితమయ్యారు గాని, రైతులు, కార్మికులు, పేదల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేరని విమర్శించారు. ప్రజల -మిగతా4లో..

## హనుమాన్ గడ్డ తండా అభివృద్ధియే నా లక్ష్యం

**గ్రామ సర్పంచ్ విస్లావత్ మాణిక్యమ్మ**

**కోయిలకొండ జనవరి 24, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం హనుమాన్ గడ్డ తండా గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయడమే నా ముందు నా లక్ష్యం అని గ్రామ సర్పంచ్ విస్లా వత్ మాణిక్యమ్మ తేల్చి చెప్పారు. శనివారం గ్రామపంచాయతీ నందు మొట్ట మొదటిసారిగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు మాజీ ఎంపిటిసి మహేందర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై గ్రామ సభను ఉద్దేశించి మాట్లాడారు. నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆశీస్సులతో గ్రామానికి అధిక నిధులు తెచ్చి గ్రామస్తులు అందరిసహకారంతో గ్రామపంచాయతీని అన్నిరంగాలలో అభివృద్ధి చేసి జిల్లాలోని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. పంచాయతీలో ప్రజలంతా ఐక్యంగా ఉండి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. గ్రామసభలో పలువురి సూచనలను తీసుకున్నారు. గ్రామపంచాయతీలో నిర్వహించిన తొలి గ్రామసభకు గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు నాయక్, అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీకి సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ ఎంపిటిసి మహేందర్ నాయక్

## స్వంత ఖర్చులతో బిజ్వారం గ్రామ అభివృద్ధి

**గద్వాల జనవరి 24, ప్రభాత వార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీలో నిధులు లేకున్నా, తమ స్వంత ఖర్చులతో గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్నారు. గ్రామ పంచాయతీ భవనానికి ప్రత్యేక పెయిటింగ్ రంగులు వేయించి ముస్తాబు చేయించారు. గ్రామ ప్రజల కోరికమేరకు గ్రామంలోని 12 వార్డులలో అన్ని విద్యుత్ స్తంభాలకు ప్రత్యేక ఎల్ఈడి లైట్లను వేయించారు. ఈసందర్బంగా సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బిజ్వారం గ్రామాన్ని గ్రామ పెద్దల సహకారంతో అన్ని రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి పరచడమే మా ముందున్న లక్ష్యమని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో పనులు చేపడుతూ, గ్రామ ప్రజల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే మా కోరిక అని సర్పంచ్ అన్నారు. గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్ కు గ్రామస్తులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి బసిరెడ్డి, టి.కృష్ణమూర్తి, రాగిమాన్ శ్రీనివాస్ రెడ్డి, జె.సిద్దయ్య, మాజీ సర్పంచ్ బి.కృష్ణ, చిన్న బాల సాహెబ్, వార్డ్ మెంబర్ హరీన్, కర్రెన్న, చాపకండ్ల అంజి, ఎస్.నాగేంద్ర, ఎస్.రాజు, ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.



స్వంత ఖర్చులతో అంబేద్కర్ చౌరస్తా లో లైట్లు వేస్తున్న దృశ్యం

## ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పరిశీలన

**వీపనగండ్ల జనవరి 24, ప్రభాతవార్త:** కమ్యూనిటీ ప్యూర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు అయినటువంటి ఎన్.ఆర్.ఐ. బొక్క సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గోపాల్దిన్నె గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కోసం ఆ గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత ఆహ్వానం మేరకు శనివారం నాడు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఆయనతోపాటు జనరల్ మేనేజర్ జూపల్లి పురుషోత్తం రావు కూడా సందర్శించినట్లు ఆ గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 6 రాష్ట్రాలలో స్వచ్ఛందంగా ఫిల్టర్ వాటర్ ను గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈయన వెంట ఆ గ్రామ ఉపసర్పంచ్ వెంకటస్వామి మాజీ సర్పంచ్ విజయ్ తో పాటు వార్డు మెంబర్ చంద్రయ్య, విజయ్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నిరంజన్ ,బాల్ స్వామి రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



ఎన్.ఆర్.ఐ.బొక్క సుదర్శన్ రెడ్డికి శాలువా కప్పి ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

## బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**వీపనగండ్ల జనవరి 24, ప్రభాతవార్త:** బాలికల హక్కులను పరిరక్షి ంచడం ప్రతి ఒక్కరూ బాధ్య తగా భావించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సోనీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లో ఏర్పాటుచేసి జాతీయ బాలికల దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చిన్నారులకు మిఠాయిలను పంచిపెట్టారు. బాలికల వెనకబాటుతనానికి విద్యలో రాణించకపోవటమే ప్రధాన కారణమని బాలురతో పాటు సమాన అవకాశాలు అందుతున్న వాటిని సద్వినియోగం చేసుకోవటంలో బాలికలు విఫలమవుతున్నారని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు బాలికలను ప్రోత్సహించి విద్యలో రాణించేలా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నేటి బాలికలే రేపటి మహిళలని అమ్మగా చెల్లిగా భార్యగా కుటుంబాలను పోషిస్తూ గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలను గౌరవప్రదంగా చూసినప్పుడే సమాజంలోని అనేక రుగ్మతలను రూపుమాపిన వారం అవుతామని ఆమె అన్నారు. ప్రాథమిక స్థాయిలో అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న పూర్వ ప్రాథమిక విద్య కోసం చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భారతి అంగన్వాడీ టీచర్లు సుగుణ భాయ్ .ఎల్లమ్మ . సువహ్లైల్వర్ నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.




అంగన్వాడి సెంటర్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపర్వైజర్ సోనీ

## దాసంగాల షెడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

**చిన్న చింతకుంట, జనవరి 24 ప్రభాతవార్త :** మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తీర్చేందుకుగాను కొండ దిగువన రాజగోపురం ముందు రౌండ్ షెడ్, పాత ధర్మశాల కోనేరు దగ్గర భక్తులకు దాసంగాల షెడ్డు నిర్మించుటకు గాను ముడా నుంచి నిధులు మంజూరు కాగా శనివారం పంచాయతీరాజ్ డిఈ లక్ష్మణ్ గౌడ్, మాజీ దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డిలు స్థల పరిశీలన చేశారు. త్వరలో షెడ్డు నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభం చేస్తామని మాజీ దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. వీరి వెంట పిఆర్ఏఈ నవీన్, మాజీ పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

## పూలే, అంబేద్కర్ రాష్ట్రస్థాయి వాలిబాల్ టోర్నమెంట్

**ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**నవాబ్‌పేట, జనవరి 24 ప్రభాతవార్త :** పూలే, అంబేద్కర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో 6వ రాష్ట్రస్థాయి వాలీబాల్ ఓపెన్ టు ఆల్ టోర్నమెంటును జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అసోసియేషన్ సభ్యులు టోర్నమెంట్ నిర్వాహకులు కొల్లూరు గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికి వాలీబాల్ టోర్నమెంట్‌ని ప్రారంభించడం జరిగింది. కొల్లూరు గ్రామ అభివృద్ధిలో అన్ని సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. అలాగే కొల్లూరు పూలే, అంబేద్కర్ అసోసియేషన్ సభ్యుడు కీ॥ పిట్టల నిరంజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పులే అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు కొల్లూరు గ్రామ నాయకులు, క్రీడాకారులు, సర్పంచు సేవ్యానాయక్, ఉప సర్పంచ్ సునీత, మాజీ సర్పంచులు రఘు, రాజు, మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, కాజా మైనుద్దీన్, కృష్ణ గౌడ్, మండల నాయకులు నీలకంఠం, రాజశేఖర్, జగన్, రమేష్, ఉప సర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.



పూలె, అంబేద్కర్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

# అందుబాటులో యూరియా బస్తాలు

**ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో బుక్ చేసుకోండి**

**మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ వెల్లడి**

**జడ్చర్ల రైతు ఆగ్రో సేవా కేంద్రం 2 సందర్శన**

**జడ్చర్ల,జనవరి 24 ప్రభాతవార్త:** జడ్చర్ల మండలంలో ఆగ్రో రైతు సేవ కేంద్రం 2 లో జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్ తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా రైతులకు పలు సూచనలు అందజేశారు. జిల్లాలో యూరియా విక్రయం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే జరుగుతున్నదని, యూరియా కొనుగోలు చేయవలసిన రైతు గూగుల్ ప్లేస్టోర్ నుండి యూరియా బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని మీ యొక్క మొబైల్ నెంబర్ తో లాగిన్ కావాలని వివరించారు. పట్టాదారు పాసు పుస్తకం నెంబర్ ఎంటర్ చేసి వచ్చిన ఓటీపీ ద్వారా ఈ సీజన్ లో రైతులు వేయబోయే పంట వివరాలను నమోదు చేస్తే సీజన్ కు సంబంధించిన యూరియా ఎలిజిబులిటీ రైతు కు చూపించడం జరుగుతుందన్నారు. తదనంతరం రైతు ఫర్టిలైజర్ బుకింగ్ ఆప్షన్ ఎంటర్ చేసిన యెడల జిల్లాలో ఎక్కడ యూరియా అందుబాటులో ఉన్నది అనేది రైతు కు కనిపించడం జరుగుతుంది. రైతు తనకు అందుబాటులో ఉన్న మండలం, డీలర్ ను ఎంచుకుని బుక్ చేసుకునే సదుపాయం కలదు. ప్రభుత్వం ఈ యాప్ అందుబాటులోకి తేవడం వలన ఎరువుల దుకాణం దగ్గర రైతులు బారులు తీరే పరిస్థితి కానీ, యూరియా దొరకక రైతులు వెనుదిరిగే పరిస్థితి కానీ అలాగే రైతులు యూరియా కోసం తమ సమయం వృధా కాకుండా ఇంటి వద్ద నుండే బుక్ చేసుకొని 24 గంటల వ్యవధిలో కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. తదనంతరం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. యాప్ మొదలు అయిన నాటి నుంచి నేటి వరకూ మహబూబ్‌నగర్ జిల్లాలో 49,750 మంది రైతులు 1,68,869 యూరియా బస్తాలను బుక్ చేసుకొని కొనుగోలు చేసారని, శనివారం 13,905 యూరియా బస్తాలు ఇంకను రైతులకు బుక్ చేసుకోవడానికి వీలుగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



జడ్చర్ల రైతు ఆగ్రో సేవా కేంద్రం 2 సందర్శిస్తున్న వ్యవసాయ అధికారి

# పార్టీలో టికెట్ల లొల్లి

**ప్రధాన రాజకీయ పార్టీల్లో టికెట్ల కోసం త్రీవ పోటీ**

**ఒకే వార్డుకు ముగ్గురు-నలుగురు అభ్యర్థుల ప్రయత్నం**

**సర్వేల ఆధారంగానే టికెట్ల కేటాయింపు**

**అభ్యర్థుల బలబలాల పై పార్టీల సర్వేలు**

**అసక్తికరంగా మారుతున్న పురపాలక ఎన్నికలు**

**మద్దూరు, జనవరి 24 ప్రభాతవార్త :** మద్దూరు పురపాలక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రభుత్వం వార్డు వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావాహుల్లో పోటీ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి బరిలో దిగేందుకు అనేక మంది ప్రయత్నాలు చేయడంతో టికెట్ల కోసం పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో వార్డు నుంచి ముగ్గురు నుంచి నలుగురు వరకు టికెట్ల ఆశావాహులు ఉండటంతో ఎవరికీ అవకాశం కల్పించాలనే అంశంపై పార్టీ నాయకత్వాలు తర్జనభర్జనలో ఉన్నాయి. కొన్ని వార్డుల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండటంతో టికెట్ కేటాయింపుపై ముందస్తు హామీలు ఇవ్వడం లేదని సమాచారం. మద్దూరు పురపాలక ఎన్నికల పరిధిలో మొత్తం 16 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు అభ్యర్థుల బలాబలాలను అంచనా వేసేందుకు ప్రత్యేక సర్వేలు చేపట్టాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఏకంగా మూడు సర్వేలు నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్, సర్వే ఫలితాల ఆధారంగానే టికెట్ల కేటాయింపుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు ఇవ్వాలనే ఆలోచనలో ఉందని తెలుస్తోంది. బీజేపీ సైతం స్థానిక స్థాయి పరిస్థితులను అంచనా వేసే పనిలో నిమగ్నమైంది. ఈ సర్వేలు ఎవరి రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయోనన్న ఆందోళన ఆశావాహుల్లో నెలకొంది. నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు ఇప్పటికే చైర్మన్‌తో పాటు వార్డు వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో నోటిఫికేషన్ వెలువడటమే మిగిలి ఉంది. ఎన్నికల సంఘం నేడో రేపో నోటిఫికేషన్ విడుదల చేయవచ్చన్న ప్రచారంతో పట్టణంలో రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. ఎన్నికల బరిలో నిలవాలని భావిస్తున్న ఆశావాహులు అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకుంటూ కాలనీల్లో పర్యటిస్తున్నారు. ఓటర్లను కలిసి మద్దతు కోరుతూ, వార్డు వారీ ఓటర్ల వివరాలపై సమగ్రంగా ఆరా తీస్తున్నారు. దీంతో మద్దూరు పురపాలక ఎన్నికలు రోజురోజుకీ మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి.




మద్దూరు పురపాలక సంఘం కార్యాలయం

## పాఠశాలలే గ్రామ అభివృద్ధికి పునాది : సర్పంచ్ మద్దిలేటి

**శ్రీరంగాపూర్, జనవరి 24 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని పీఎం ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ మద్దిలేటి, ఉప సర్పంచ్ కాజా శనివారం రోజు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాఠశాలలే పునాది అని, గ్రామ అభివృద్ధిలో పాఠశాలలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని, విద్యా వ్యవస్థలు ప్రాథమిక పాఠశాలలో పట్టుకొమ్మలని ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందితే భవిష్యత్తులో సమర్థవంతమైన మానవ వనరులుగా వృద్ధి చెందుతారని ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఉప సర్పంచ్ కాజా మాట్లాడుతూ గ్రామ పరిపాలనలో విద్య వైద్యానికి ప్రాముఖ్యత ఇస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులసంఖ్య పెంపునకు ఉపాధ్యాయులతో కలిసి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సన్మానించిన ఉపాధ్యాయ బృందం గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం తొలిసారిగా పీఎం శ్రీరంగాపూర్ పాఠశాలను సందర్శించిన సందర్భంగా సర్పంచ్ మద్దిలేటి ఉపసర్పంచ్ కాజాను పాఠశాల ఉపాధ్యాయ బృందంతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు, ఉపాధ్యాయులు వసంతపురం రాజు, దామోదర్ బాబు, సంరిన్ బేగం, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్లింబేగం, ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## పేదలకు ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

**నవాబుపేట, జనవరి 24 ప్రభాతవార్త :** పేదలకు ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా లబ్ధిదారులకు ఆసరాగా నిలుస్తున్నాయని గురుకుంట సర్పంచ్ రవీందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు అన్నారు. మండల పరిధిలోని గురుకుంట గ్రామానికి చెందిన బంటు నిర్మలమ్మ బ్యాగరి స్వప్న లబ్ధిదారులకు రూ. 60 వేలు 38 వేల చెక్కులను జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం లబ్ధిదారూలకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుంట డిప్యూటీ సర్పంచ్ బోవళ్ళ రాజశేఖర్, 4 వార్డ్ మెంబర్ సింగం మధుసుదన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.రవీందర్ రెడ్డి, మన్నె చంద్ర కాంత్ రెడ్డి, బోయిని నర్సింహులు, వెంటయ్య, బోయిని పాండు, బోవళ్ళ వీరయ్య, వెంకటేష్, రామచారి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

# భూత్పూర్‌లో బీఆర్ఎస్ నిరసన

**- పోలీసులు పక్షపాత ధోరణిని విడనాడాలని నిరసనలు**

**- దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకుల్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్**

**భూత్పూర్, జనవరి 24, ప్రభాతవార్త :** భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డిలిరువురు తమ పార్టీ నాయకుడు మద్దిగట్ల వెంకటేష్‌గౌడ్‌ను ఒంటరిని చేసి వ్యక్తిగత కక్షలతో అతనిపై భౌతిక దాడులకు పాల్పడి తీవ్రంగా గాయపరిచిన కాంగ్రెస్ నాయకులు కేసిరెడ్డి, భూపతిరెడ్డిలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో పెద్దఎత్తున నిరసనలు తెల్పుతూ, భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూత్పూర్ చౌరస్తాలో కొంత సేపు నిరసన, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళీధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, రాము రాథోడ్, మొహ్మద్ సాధిక్, గడ్డం ప్రేమ్ కుమార్, కేబీఆర్ గౌడ్, రాజుగౌడ్, నరేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అరాచకాలు పెరిగాయని, ఎమ్మెల్యే అండదండలు చూసుకుని కొందరు కాంగ్రెస్ నాయకులు గూండాయిజమ్ చేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ నాయకుడు వెంకటేష్‌గౌడ్‌ను మద్దిగట్లలోని రైతువేధిక వద్దకు తీసుకెళ్లి విచక్షణరహితంగా దాడిచేసి గాయపరిచారని పేర్కొన్నారు. తాము భూత్పూర్ పీఎస్‌కు వెళ్లినా కేసు నమోదు చేయకుంటే, మాజీ ఎమ్మెల్యే ఆలతో పాటు తమ పార్టీ నాయకులందరూ బాధితుడైన వెంకటేష్‌గౌడ్‌తో కలిసి జిల్లా ఏఎస్పీ, డీఎస్పీలను విడివిడిగా కలిసిన మీదట జిల్లా పోలీసు అధికారుల ఆదేశానుసారం చిట్టచివరకు దాడులకు పాల్పడినవారిపై కేసు నమోదు చేశారని అన్నారు. దాడులు జరిగి ఐదు రోజులైనా, కేసు నమోదై మూడ్రోజులైనా ఇప్పటికి వరకు దాడులకు పాల్పడిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేయలేదని అన్నారు. చట్టాన్ని కాపాడి, బాధితులను కాపాడాల్సిన పోలీసులు అధికారపార్టీకి వత్తాసు పలకడం సమంజసం కాదని హితవు చెప్పారు. బాధితుడు తనకు న్యాయం చేయాలని పోలీసులు, అధికారుల చుట్టూ తిరుగుతుంటే దాడులకు పాల్పడినవారు దర్జాగా తిరుతున్నారని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీ నాయకులలకు ఆసరాగా ఉండకుండా నిజమైన బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తూము శ్రీనివాస్‌గౌడ్, మనెమోని సత్యనారాయణ, మేకల సత్యనారాయణ, మొల్గర నర్సింహులుగౌడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, ఫసియోద్దిన్, మొహ్మద్ షాకీర్, గడ్డం రాములు, సత్తూర్ అశోక్‌గౌడ్, రామకృష్ణ, నర్సింహులు యాదవ్, ఆగిరి వెంకటేష్, గొడుగు వెంకటరాజు, సత్తూర్ సదానంద్‌గౌడ్, రామస్వామిగౌడ్‌తో పాటు బాధితుడు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## రాష్ట్రస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలకు మక్తల్ విద్యార్థులు




రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**మక్తల్ టౌన్, జనవరి 24 ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ నర్సయ్య ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 26 వరకు సిద్దిపేటలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి మోంటెన్ సైకిలింగ్ పోటీలకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పిఈటి బి .గోపాలం ఆధ్వర్యంలో 17 మంది బాల బాలికలు ,సైకిల్ రైడర్స్ ఈనెల 24న సిద్దిపేటకు తరలి వెళుతున్నామని బి. గోపాలం తెలిపారు. సైక్లింగ్ రైడర్స్‌కు గత సంవత్సరం రాష్ట్ర స్థాయి మోంటెన్ సైకిలింగ్ పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన టి.అనూష కోచ్‌గా వ్యవహరిస్తారని బి. గోపాలం తెలియజేశారు. సొంత ఖర్చులతో రాష్ట్ర జాతీయస్థాయి పోటీలకు క్రీడా రంగానికి అంకితమై, క్రీడాకారులకు అనేక క్రీడల్లో ఉచిత మెరుగైన శిక్షణ ఇస్తూ, ఇప్పటి వరకు 176 మందిని జాతీయ స్థాయిలో, 6 మందిని అంతర్జాతీయ స్థాయిలో ఆడించానని బి.గోపాలం తెలిపారు.

## కాంగ్రెస్‌లోకి నేడు బాలకోటి

**భూత్పూర్, జనవరి 24, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, గిరిజన నాయకుడు బాలకోటి(బాలు) ఆదివారం అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈ మేరకు బాలకోటి దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బాలకోటి పార్టీ మారడమనేది బీఆర్ఎస్ కు కొంత వరకు ఎదురు దెబ్బని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవీని ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆయా పార్టీలు ఎస్టీ అభ్యర్థి కోసం వేటను సాగిస్తున్న తరుణంలో తమ అభ్యర్థులనుకున్న నాయకులు పదవుల కోసం పార్టీలు మారడం సర్వసాధారణమని పలువురు బీఆర్ఎస్ నాయకులు పెదవి విరుస్తున్నారు.

## యూత్ అధ్యక్షుడికి సన్మానం

**శ్రీరంగాపూర్, జనవరి 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి శనివారం వనపర్తి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా శ్రీరంగాపూర్ మండల యూత్ అధ్యక్షుడు గంగాధర్ యాదవ్ మర్యాద పూర్వకంగా శివ చరణ్ రెడ్డిని కలిసి శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. శివ చరణ్ రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేస్తూ శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు గంగాధర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## ప్రారంభమైన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

**వంగూరు, జనవరి 24 ప్రభాతవార్త:** వంగూరు మండలం గాజర గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా గ్రామ ప్రజల సందోహంతో ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ పులిగిల్ల శ్రీపతిరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనము, కంకనాధారం, గ్రామసకలదేవతలకు అభిషేకం, ఆంజనేయస్వామికిఅభిషేకం, లక్ష్మీ గణపతి, వెంకటేశ్వర స్వామి హోమంలో గ్రామ ప్రజలుదంపతులు కూర్చొని వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలతో గాజర గ్రామంలోని పురవిధుల గుండా ఊరేగింపు నిర్వహించి, కళాకారులచే ప్రత్యక నృత్యాలను నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిరావు, మహిళా కాంగ్రెస్ పార్టీజిల్లాఉపాధ్యక్షురాలు మానస, సత్యనారాయణ, నాయకులు నారాయణరావు, సైదులు, ఏటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాక...

**దేవరకద్ర, జనవరి 24 ప్రభాతవార్త :** కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రానున్నారని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి గ్రామంలో ఉదయం 11 గంటలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని, నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారని కౌకుంట్లమండలఅధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమానికి కౌకుంట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నూతన సర్పంచ్, ఉపసర్పంచ్లు, ఓబిసి అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి కోరారు.

## వైభవంగా ఆనందగిరి లక్ష్మి వేంకటేశ్వర స్వామి కళ్యాణం



లక్ష్మి వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని జరుపుతున్న వేద పండితులు

**బిజినేపల్లి జనవరి 24 ప్రభాతవార్త:** బిజినేపల్లి ఆనందగిరి కొండపై వెలిసిన లక్ష్మి వేంకటేశ్వర స్వామి కళ్యాణం శనివారం వైభవంగా జరిగింది. అనందగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పురాతన ఆనందగిరి లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉత్సవమూర్తులను గ్రామానికి చెందిన సుల్తాన్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా పట్టువస్త్రాలు అభరణాలు, పూలతో అందంగా అలంకరించుకొని పెళ్ళి మండపం వరకు పల్లకిలో తీసుకొచ్చారు. జిల్లకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, అరుంధతి నక్షత్ర దర్శనం వంటి కళ్యాణ క్రతువులు భక్తిశ్రద్ధలతో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు గ్రామ సర్పంచ్ మిద్దె ఇందిర రాములు, ఉపసర్పంచ్ మహేష్ యాదవ్ పంచాయతీ సిబ్బందితో కలిసి ఏర్పాట్లు చేసి ఉచిత అన్న ప్రసాదం అందించారు. కళ్యాణోత్సవంలో పంచాయతీ సిబ్బంది శ్రీశైలం, జశ్వంత్, రవి, కృష్ణ, గ్రామస్తులు అల్లోజీ, జియాజీ, శేఖర్, శ్రీకాంత్ శర్మ తదితరులు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 24 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శివాలయం ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన రేపాని వెంకట్ నారాయణ రూ.1,00,116లను శనివారం ఆలయ నిర్మాణ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాన్ని భక్తి భావంతో నాణ్యతగా నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బచ్చల కూర శ్రీనివాసులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్, మైసయ్య, భీమయ్యగౌడ్, నరసింహ, లాలయ్య, సందీప్, రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నారాయణపేట అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా అఖిల్ నాయక్

**కోయిలకొండ జనవరి24, ప్రభాతవార్త:** నారాయణపేట కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా అఖిల్ నాయక్ నుఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కాటి చరణ్ రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆశీర్వాదంతో పదవి రావడం జరిగిందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్నని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాలలో ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విద్యాసాగర్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యపాల్ రెడ్డి, పి శేఖర్ కృషి వల్ల పదవి వరించినందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, యువజన కాంగ్రెస్ నాయకులకు ,మండల కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## తమిళనాడుకు పియు జట్టు




తమిళనాడుకు బయలుదేరి వెళ్లిన జట్టు

**మహబూబ్‌నగర్, జనవరి 24 ప్రభాతవార్త:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే సౌత్ జోన్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో భాగంగా పాలమూరు యూనివర్సిటీ మహిళా విభాగంలో క్రికెట్ టీం అన్నా యూనివర్సిటీ తమిళనాడులో జరుగు సౌత్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ క్రికెట్ జట్టు బయలుదేరింది. ఈ క్రీడలు ఈ నెల 26 నుండి 30 తారీఖు వరకు జరుగు పోటీలు జరగనున్నాయి. ఇందులో ఎంపికైనక్రీడాకారులనుఉద్దేశించి పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముందుగా ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపి క్రికెట్ టీం మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి మెడల్స్ తీసుకురావాలని అదేవిధంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులుఅందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొ॥ పూస రమేష్ బాబు, అకాడమిక్ ఆడిసై డైరెక్టర్ డా.ఎన్ చంద్ర కిరణ్ ,యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.డి మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా. ఎం. కృష్ణయ్య, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు, కోచ్ మన్నన, డా. సుదర్శన్ రెడ్డి లతోపాటు ఎంపికైన క్రీడాకారులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల శంఖారావం పూరించిన జనసేన

### జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేయాలి : జనసేన పార్టీ నాయకులు

**నారాయణపేట, జనవరి 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పేట జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ నాయకులు ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర ఆడ్‌హాక్ కమిటీ సభ్యులు డా. మణికంఠ గౌడ్ ఆధ్వర్యం వహించగా, తెలంగాణ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికలకోఆర్డినేటర్ శ్రీముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రేమ కుమార్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలోని అన్ని మున్సిపల్ కేంద్రాల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేయనున్నారని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నీతి, నిజాయితీ గలనాయకుడని,ఆయన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి జనసైనికుడిదని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పనిచేసే వారికి పార్టీ తరఫున బి ఫారాలు అందజే స్తామని వెల్లడించారు. మక్తల్ నియోజకవర్గంలో పార్టీ ఇంచార్జ్‌గా డా.మణికంఠ గౌడ్ కష్టపడు తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సుమారు20 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారిని పోటీకి సిద్ధంచేసినట్లు తెలిపారు. అనంతరం ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మున్సిపల్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. డా.మణికంఠ గౌడ్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని, యువత ముందుకు వచ్చి పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ సేవాగుణం, సనాతన ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్న నాయకుడని అన్నారు పేట, మద్దూరు, కోస్గి, మక్తల్, ఆత్మకూరు, అమరచింత మున్సిపల్ కేంద్రాల్లోని అన్ని వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ జనసేన నాయకులు, నారాయణపేట జిల్లా నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, మున్సిపల్ వార్డుల అభ్యర్థులు మరియు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

# జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

● మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణ

**చిన్న చింతకుంట, జనవరి 24 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పాలమూరు ఎంపీ డీకే అరుణ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సీసీ కుంట, ఉంద్యాల గ్రామాల మధ్య నక్కల వంపు పై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద కోటి 76 లక్షల నిధులతో చేపడుతున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 10వేల మందికి లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద చేపట్టే పనులకు సంబంధిత అధికారులు స్టడీ చేయాలని సూచించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులకు రాష్ట్రం ప్రభుత్వ వాటా చెల్లించే ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసే రోడ్లకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు ముందుకు రావడంలేదని ఆమె విమర్శించారు. గతంలో వేసిన రోడ్లకు ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించి పెండింగ్‌లో ఉన్నా రోడ్లు వేసేలా చొరవ చూపాలన్నారు. పాలమూరుజిల్లాలోఎక్కడికి వెళ్లినా ప్రజలు రోడ్లు వెయ్యాలని దరఖాస్తులు ఇస్తున్నారని ఆమె తెలిపారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా రవాణా ముఖ్యమని దాని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి బీటీ రోడ్లను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మండలంలో గోపియా నాయక్ తండాకు రహదారులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమదృష్టికి తీసుకు వచ్చారన్నారు. గ్రామాభివృద్ధిశాఖ ,రోడ్డు భవ నాల శాఖ మంత్రులను సీఎం సమన్వయం చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ఆమెడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లాఅధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు పద్మజా రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, జిల్లా నాయకులు నంబిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కురువ రమేష్, పార్టీ మండల అధ్యక్షులు దశరథ్, గ్రామ సర్పంచ్ మానస దశరథ్, పిఆర్‌డిఈ లక్ష్మణ్ గౌడ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధిని వేగవంతం చేయాలి

● కొడంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుముల తిరుపతిరెడ్డి ● మద్దూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మద్దూరు,జనవరి 24 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో పట్టణాభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం మద్దూరు టౌన్‌లో రూ. 35 కోట్ల వ్యయంతో అండర్ డ్రైనేజీ, రేణువట్లలో రూ.15 కోట్లతో తాగునీటి సరఫరా సదుపాయాల కొరకు శంకుస్థాపన నిర్వహించారు. మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుముల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి" అని అన్నారు. పట్టణాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి,మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తోంది. ఎనుముల తిరుపతిరెడ్డి అధికారులకు, పనుల్లో నాణ్యత పాటిస్తూ, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలి" అని సూచించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కొడంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుముల తిరుపతిరెడ్డి

ఈ కార్యక్రమంలో కొడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, గుళ్ల నర్సింహులు, వీరేష్‌గౌడ్, రఘుపతిరెడ్డి, నిడ్జింత తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,సంజీవ్, బర్ల మల్లికార్జున్, రేణువట్ల అశోక్ గౌడ్, గోవిందు, చందు, నర్సింలుగౌడ్, ప్రకాష్, హుస్సేన్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

◆ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి ◆ రాష్ట్ర టియూసిఐ అధ్యక్షులు సూర్యం

**మక్తల్ టౌన్, జనవరి 24 ప్రభాతవార్త :** మిషన్ భగీరథ స్కీమ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 వేల మంది పనిచేస్తుండగా వారందరికి మిషన్ భగీరథ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సకాలంలో వేతనాలు చెల్లించాలని టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం అన్నారు. తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ మక్తల్ సెగ్మెంట్ కమిటీ సమావేశం సత్యసాయి మందిరంలో సంఘం అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించగా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ స్కీమ్‌లో పని చేస్తున్న కార్మికులు సకాలంలో జీతాలు లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని సొంత డబ్బులతో వాహనాలకు పెట్రోల్ పోసుకొని విధులు నిర్వహిస్తున్న యాజమాన్యాలకు కనికరం లేకుండా పోయిందని అన్నారు. నెలల తరబడి వేతనాలు బకాయిలో ఉండడం, పీఎఫ్ బకాయిలో ఉండడం వలన కార్మికులకు సంక్షేమం చేకూరడం లేదని వేతనాలు లేకుండా కార్మికులు ఎలా



మాట్లాడుతున్న రాష్ట్ర టియూసిఐ అధ్యక్షులు సూర్యం

పనిచేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించి మిషన్ భగీరథ స్కీమును కార్పొ రేషన్‌గా మార్చి నేరుగా కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టియూసీఐ అధ్యక్షులు కిరణ్,నరసింహారెడ్డి, మహేష్ శెట్టి, లక్ష్మణ్, కాసిం, సత్యనారాయణ, బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ

**లింగాల, జనవరి 24 ప్రభాతవార్త:** లింగాల మండలంతో పాటు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం లింగాల మండల కేంద్రంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఈశ్వరమ్మ సన్మాన కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాల మేజర్ గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మను కాంగ్రెస్ పార్టీ తరపున గెలిపించిన సందర్భంగా గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. రాబోయే కాలంలో గ్రామాల్లో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ, విద్యుత్ వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. అప్పాయిపల్లి నుంచి సలేశ్వరం,మన్ననూర్ నుంచి సలేశ్వరం వెళ్ళే మార్గంలో మట్టి రోడ్లు, సిసి రోడ్లు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గ్రామాల్లోని చెరువులు, కాల్వలు,తూముల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి గ్రామ పంచాయతీ భవనాలు అదే విధంగా 21 మహిళా సమాఖ్య



మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

భవనాలు, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 2 గోదాములు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అంతకుముందు సర్పంచ్ ఈశ్వరమ్మను, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్‌మండలధ్యక్షులు నాగేశ్వరరావు,కాంగ్రెస్ నాయకులు పూజారి వెంకటయ్య, చంచేటి శివ, లక్ష్మన్ నాయక్, రవి, సలేశ్వరం, శ్రీశైలం,వార్డు సభ్యులు వెంకటయ్య, వెంకటేష్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

◆ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ◆ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వెల్దండ, జనవరి24 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని గానుగట్టు తాండ గ్రామంలో రూ.4.20కోట్ల నిధులతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మోనిక లచ్చిరాంతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శిలాఫలకం వద్ద టెంకాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆమనగల్లు నుండి ఉధృతంగా పారే వాగుకు గానుగట్టు తాండ బ్రిడ్జ్ కూలి పోవడానికి సిద్ధంగా ఉండడంతో అదే స్థానంలో నూతన బ్రిడ్జికై ప్రతిపాదనలు తయారుచేసి అనుమతులు తీసుకొని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమం వారి అభివృద్ధి కోసం నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాల కృషి చేస్తున్నారని, అనేక కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, తహసిల్దార్



వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కార్తీక్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, నాయకులు పర్వత్ రెడ్డి, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, సర్పంచ్‌లు మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్, శారదా హరికిషన్ నాయక్, గన్యా నాయక్, వెంకట్‌రెడ్డి, నాయకులు రషీద్, పుల్లయ్య, శంకర్ నాయక్, లక్పతీనాయక్, ఏఈ సురేందర్ రెడ్డి, పురుషోత్తంచారి, భరత్ గౌడ్ తో పాటు తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



వన నర్సరీలో మొక్కల పెంపకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 24 ప్రభాతవార్త:** మండలంలోని పోతేపల్లి గ్రామపంచాయతీ వన నర్సరీలో మొక్కల పెంపకానికి సంబంధించిన పనులను శనివారం గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందుతుందని,అందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని, ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను నాణ్యతతో, బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపుసింగ్, అంజి మాస్టర్, అశోక కుమార్, వావిళ్ళ యాదగిరి, శివ,మార్కండేయుడు, ఉడుత శివ,రవి,లింగయ్య, మహేష్, ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

## పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు



సంజీవ్‌ముదిరాజ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు

**భూత్పూర్,జనవరి 24, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన బీసీసామాజిక వర్గానికి చెందిన వెంకటేష్ గౌడ్‌పై నిర్ధాక్షిన్యంగా భౌతిక దాడులకు పాల్పడిన భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భూత్పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డిలను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్‌సాగర్,బీసీ ఎస్సీ,ఎస్టీ రైట్స్ జాక్ రాష్ట్ర కన్వీనర్ సారంగి లక్ష్మికాంత్‌ల నేతృత్వంలో పలు బీసీ కుల సంఘాల ప్రతినిధులు శనివారం డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి బుగ్గన్న, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివన్న,బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ సాగర్,ఆరెకటిక సంఘం నాయకులు శ్రీనివాస్,బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గం కన్వీనర్ బి శేఖర్,బీసీ సమాజ్ మహబూబ్‌నగర్ మండల కన్వీనర్ కేశవులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**భూత్పూర్,జనవరి 24,ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విచారకర సంఘటన శనివారం భూత్పూర్ పట్టణ పరిధిలోని ఒకటోవార్డు సిద్దయ్యపల్లి డబుల్ బెడ్ ఇళ్ల సముదాయంలో చోటుచేసుకుంది. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన బోడ మహేష్(32) ప్రస్తుతం తన భార్యాపిల్లలతో సిద్దయ్యపల్లి డబుల్‌బెడ్ ఇళ్ల సముదాయంలో నివాసముంటున్నారు. మహేష్ మేస్త్రీ పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బంధుల కారణంగా భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. 24వ తేది శనివారం మహేష్ తన భార్య అయిన భాగ్యతో గొడవపడి, భార్యను కొట్టి మనస్థాపానికి గురై ఇంట్లోకెళ్లి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి బోడ అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

**మద్దూరు, జనవరి24 ప్రభాతవార్త:** మద్దూరు మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భీమేష్ ( 22) సంవత్సరాలు శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజుల కిందట పరిచయమైన కొత్తపల్లి మండలానికి చెందిన యువతి ఇంటికి వెళ్లగా యువతి కుటుంబ సభ్యులు గమనించి మందలించారు. యువతిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా ఉరి వేసుకొని చనిపోయాడని, ఆ యువతి కుటుంబ సభ్యుల మీద చట్టపరమైన చర్య తీసుకోవాలని మృతుని తండ్రి అయిన లాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**నర్వ, జనవరి24 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి,ప్రజల ప్రాణాలను కాపాడటమేఅరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ముఖ్య లక్ష్యం అని నర్వ ఎస్సై పబ్బతి రమేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం లో భాగంగా శనివారం తొమ్మిదవ రోజున నర్వ మండల కేంద్రంలోని శివాలయం వద్ద అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించి, రోజువారీగా చర్యలు చేపడుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, డ్రైవర్లు, సాధారణ ప్రజల కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ట్రాఫిక్ నిబంధనల పాటింపుపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

## త్రిబుల్ ఐటీని సాధించాం..

మొదటి పేజీ తరువాయి భాగం

కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.2 కోట్లు, ఒకేషనల్ జూనియర్ కళాశాల కోసం ఆధునిక క్యాంపస్, ఎంవిఎస్ బాలుర జూనియర్ కళాశాలకు రూ.7కోట్ల 95 లక్షలు, ఎన్టీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.6 కోట్ల.86 లక్షలు మంజూరు చేయించామని వివరించారు. రాజకీయ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అద్భుతమైన ఫలితాలు సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వలసల జిల్లాను చదువుల జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అకాడమిక్ ప్రోగ్రాంతో పాటు ఐఐటీలో సీటు సాధించే విధంగా అధ్యాపకులు విద్యార్థులను తీర్చిదిద్దుతారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామికసహకార సంఘం పర్సన్ ఇంఛార్జి గోనెల శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందే మాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, సోము భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జి రామ్ జి తోనే గ్రామాల అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి భాగం..

లేదన్నారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నరేంద్ర మోడీ పని చేస్తున్నారన్నారు. 2047నాటికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రపంచంలోనే భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు దేశప్రధాని మోదీ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. వికసిత్ గ్రామంతోనే వికసిత్ భారత్ సాధ్యమని ప్రధాని నరేంద్ర మోడీ ఈ పథకాన్ని తీసుకువచ్చా రన్నారు. బాధిత కుటుంబాలను ఎంపీ పరామర్శ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని యాత్రకు వెళ్లిన పర్దీపూర్ గ్రామానికి చెందిన యువకులు కావలి నరసింహులు ,ధన్వాడ శివకుమార్ రోడ్డు ప్రమాదంలో 15 రోజుల క్రితం మృతి చెందడంతో ఈ సమాచారం తెలుసుకున్న పార్లమెంటు సభ్యురాలు డీకేఅరుణ బాధిత కుటుంబాల సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు పద్మజారెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కురువ రమేష్, మండల అధ్యక్షులు దశరథ్, పర్దీపూర్, గోపియా నాయక్, తండ సర్పంచులు శివకుమార్, రాములు నాయక్, నాయకులు కావలినరేష్, రాములు, వెంకటయ్య గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీకృష్ణ, పల్లమర్రి వెంకటేష్, కావాలి ఆంజనేయులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవినీతిపరులను ఓడించండి

◆ ప్రశ్నించే గొంతుకలను గెలిపించండి ◆ మున్సిపాలిటీని ప్రక్షాళన చేయండి
◆ అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్


13వ వార్డు బిజెపి అభ్యర్థికి మద్దతు తెలుపుతున్న నాయకులు

**వనపర్తి రూరల్, జనవరి24 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికల్లో అవినీతి పరులను ఓడించి ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం 28వ వార్డు, 5 వ వార్డు, 13వ వార్డు లను ఆయన సందర్శించారు. అనంతరం డా" సతీష్ యాదవ్ మాట్లాడుతూ అనువైన చోట అఖిలపక్ష ఐక్యవేదిక సభ్యులు పోటీ చేస్తారని, మున్సిపాలిటీలో అవినీతి అంతం చేయడానికి దేనికైనా సిద్ధమని, అవసరమైతే ఏత్యాగానికైనా నేను సిద్ధమని అన్నారు. ఒక ప్రశ్నించే గొంతుక మాట్లాడితే, అవినీతిపరులు అదిరిస్తారు, బెదిరిస్తారు, అవసరమైతే దాడి చేస్తారు.అయినా సరే పుట్టిన ఊరికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఏ త్యాగా నికైనా సిద్ధమని, చెప్పిన మాట నెరవేరితే చాలని తెలిపారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తర్వాత నామినేషన్ వేసే అభ్యర్థులను బట్టి నిర్ణయాలు తెలుపుతామని అంతవరకు ప్రజలతో మమేకమై వనపర్తికి ఎవరు కీడు చేశారు,ఎవరు దోచుకున్నారో తగుసాక్షాలతో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, బత్తిని మధు, రామస్వామి, నాగరాజు, రమేష్, జక్కుల రాములు, వెంకటస్వామి, రమేష్ నాయక్, మన్యం నాయక్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుడి కుటుంబానికి భరోసా

- రూ.52,500ల ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వంగూరు, జనవరి 24 ప్రభాతవార్త:** ఒకే తరగతి గదిలో కలిసిమెలిసి చదువుకున్న తోటి మిత్రుడు బండపల్లి బాలస్వామి గత కొంతకాలం క్రితం అకాల మరణం పొందడంతో ఆ మిత్రుడు కుటుంబానికి ఆపద ఏర్పడిందనే విషయాన్ని తెలుసుకున్న 10 తరగతి 1986-87 బ్యాచ్ మిత్రులు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించి ఆ కుటుంబానికి భరోసాను కల్పిస్తూ మేము అండగా ఉన్నామని ధైర్యాన్ని కల్పించి మానవత్వాన్ని చాటుకున్న సంఘటన వంగూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గత నాలుగు రోజుల క్రితం వంగూరు మండల కేంద్రానికి చెందిన బండపల్లి అలివేల నివసిస్తున్న ఇల్లు విద్యుత్ ఖాతానికి గురై ఇంట్లో ఉన్న వస్తువులు విలువైన పత్రాలు కాలి బూడిద కావడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి అలివేలు భర్త మిత్రులు చేయూత అందించి 52,500 ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మిత్రుడు కుటుంబానికి ఏ ఆపద వచ్చినా సకాలంలో స్పందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వంగూరు గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య, మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్ రావు, బండపల్లి శివరాములు, చంద్రమోళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాబు మోహన్ చేతుల మీదుగా ఉత్తమ క్యారెక్టర్ అవార్డు అందుకున్న బుక్క విష్ణుమూర్తి



**శ్రీరంగాపూర్, జనవరి 24 ప్రభాతవార్త:**శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన బుక్క విష్ణు మూర్తి భూమికి దాహం అనే తెలుగు షార్ట్ ఫిలింలో రైతు పాత్రలో నటించి నందుకుగాను తననటన ప్రతిభను గుర్తించి బెస్ట్ క్యారెక్టర్ ఆర్టిస్టు అవార్డుకు విజేత ఫిలిం అవార్డ్స్ వారు ఎంపిక చేశారు. ఈ అవార్డు ను బుక్క విష్ణుమూర్తి నటుడు బాబుమోహన్ చేతుల మీదుగా శనివారం హైదరాబాదు ప్రసాద్ ల్యాబ్‌లో అవార్డును అందుకోవడం జరిగింది. శ్రీరంగాపురం గ్రామం నుంచి షార్ట్ ఫిలింలోనటించి అవార్డును అందుకున్నందుకు గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ బుక్క విష్ణుమూర్తికి అభినందనలు తెలియజేయడం జరిగింది.

## సిఈఓ సస్పెండ్

**లింగాల, జనవరి 24 ప్రభాతవార్త:** లింగాల మండలంలోని అంబట్ పల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న సిఈఓ పాండును సస్పెండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కోఆపరేటివ్ అధికారి రఘునాథ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు అందాల్సిన రుణమాఫీ, రికార్డులో అవకతవకలకు పాల్పడడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.సింగిల్ విండోకార్యాలయంలోని రికార్డులో మ్యానువల్ ఆన్‌లైన్ అవకతవకలు చూపిస్తూ రైతులపై నిరక్ష్యం చేస్తూ, నిధులు దుర్వినియోగం చేయడంతో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి ఈ నెల 19 న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## కొనసాగుతున్న మాంసాహార జంతువుల గణన


మాంసాహార జంతువుల ముద్రణల సర్వే చేస్తున్న సిబ్బంది

**లింగాల, జనవరి 24 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ ఎఫ్ఆర్ఓ ఈశ్వర్ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. శనివారం లింగాల మండల పరిధిలోని ఉన్నబీట్ ప్రాంతాల్లో ఉదయం నుంచి కాలినడకన 5 కిలోమీటర్ల దూరంలో ట్రైల్ పాత్ సర్వే నిర్వహించారు. ఎక్కువ శాతం ఈ సర్వేలో పెద్దపులి, చిరుతపులి,ఎలుగుబంటి,రేసు కుక్కలు,అడవిపిల్లి వంటి వన్య ప్రాణుల ఉనికిని గమనించినట్లు తెలిపారు. అదేవిధంగా మర్లపాయ, పద్మన పల్లి,అప్పాయిపల్లి,లింగాల,ధారారం,రాయవరం,గొర్రెమడుగు బీట్ ప్రాంతాల్లో డీఆర్ఓలు లింగాల,అప్పాయిపల్లి సహదేవ్, నరేంద్ర కుమార్, ఎఫ్ఎస్ఓ రాంబాబు,ఎఫ్బీఓలు ఖాదర్‌భాషా,శివాజీ,మురళీకృష్ణ,రమేష్,నరేందర్, పర్వీన్ బేగం,ప్రవీణ్‌లు మాంసాహార సర్వే లెక్కింపులో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.వాలంటీర్స్,బేస్‌క్యాంప్‌వాచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## మావోయిస్టు కీలక నేతలు అరెస్టు

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ఎలాంటి సహాయం చేయవద్దని ఎస్పీ హెచ్చరించారు. అలాంటి చర్యలు చట్టరీత్యా నేరమని, సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.భూగర్భ కార్యకర్తలు ప్రభుత్వ లొంగుబాటు-పునరావాస విధానంను వినియోగించుకొని సమాజంలో శాంతియుత జీవితానికి తిరిగి రావాలని ఎస్పీ సూచించారు.


మావోయిస్టుల నుంచి సీజ్ చేసిన సామాగ్రి

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరిక
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

**కల్వకుర్తి, జనవరి 24 ప్రభాతవార్త:** రానున్న మున్సిపల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతో పనిచేయాలని ఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్,కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి బృంగి ఆనంద్‌కుమార్,పట్టణ అధ్యక్షులు చిమ్ములశ్రీకాంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి,మాజీ కౌన్సిలర్లు హన్మ నాయక్,చిన్న, బాలునాయక్, చిత్తరి శ్రీను, మక్బూల్ ఉన్నారు.

## ఒక బాలికను చదివిస్తే.. ఒక కుటుంబాన్ని చదివించినట్లే

### సివిల్ జడ్జి బి.సాయి మనోజ్


మాట్లాడుతున్న సివిల్ జడ్జి బి.సాయి మనోజ్

**నారాయణపేట,జనవరి 24 ప్రభాతవార్త:** బాలికలే దేశ భవిత మనందరి బాధ్యత జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు తెలంగాణ రాష్ట్రన్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పేట ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకోవడం వెనుక ఉద్దేశ్యం బాలికల హక్కులు, విద్య, భద్రతపై అవగాహన పెంచడమేనని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో" వంటి ప్రభుత్వ పథకాలు బాలికల రక్షణ,విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని, వాటిని విజయవంతం చేయా ల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు బాలికలు సమాజానికి వెన్నెముక లాంటివారని, వారు భవిష్యత్తులో నాయకులు, తల్లులు,మార్పుదిశగా నడిపించే శక్తులని పేర్కొన్నారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, పోష కాహారం, సాధికారత అందించడం ద్వారా వారిని ఆత్మవిశ్వాసంతో ముందుకు తీసుకురాగలమని చెప్పారు. బాలురు-బాలికల మధ్య ఉన్న అసమానతలను తొలగించేందుకు ఈ దినోత్సవం ప్రత్యేకంగా జరుపు తున్నామని వివరించారు. దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, రక్షణ చర్యలు, తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 గురించి వివరించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో ధనలక్ష్మీ పథకం వంటి పథకాల ప్రాముఖ్యతను చెప్పారు పిల్లలను లైంగిక నేరాల నుండి రక్షించే పోక్సో చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిరోధానికి ఉన్న చట్టాలు, సామాజిక రక్షణ వ్యవస్థలపై వివరించారు. అవసరమైనప్పుడు 15100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మీపతి గౌడ్, న్యాయవాది నందు నామాజీ, జిల్లాచైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మా, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ జి.నరసింహా, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పారాలీగల్ వాలంటీరు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దు

**బాల్య వివాహాలు బాలల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దు : తహసీల్దార్ జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు**


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

**అయిజ జనవరి 24, ప్రభాతవార్త:** ఎట్టి పరిస్థితుల్లో బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దని బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దని తాసిల్దారు జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ మీటింగ్ హాల్ నందు మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల ప్రోగ్రామ్‌లో భాగంగా బాల్యవివాహాల నిర్మూలణ పైన సర్వీస్ ప్రొవైడర్స్ పురోహితులు, ఖాజీలు పాస్టర్స్, ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, టెంట్హౌస్ మరియు ప్రింటింగ్ ప్రెస్‌అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్ కు అడ్డంకులు అని తెలిపారు, కావున బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితులలో ప్రోత్సహించ వద్దని అన్నారు. ముఖ్యంగా పెళ్ళిల ఏర్పాటులో ముందుగా తెలిసేదే మీకు అని, మీరు పెళ్లి ఏర్పాట్లు చేసేముందు పిల్లల వయస్సు ముందే ధ్రువీకరించుకోవాలని సూచించారు. లేని పక్షంలో అట్టి బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిగా శిక్షార్హులు అవ్వతారని హెచ్చరించారు. చైల్డ్ మ్యారేజ్ చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు మనమే కాలరాసినట్టు అవుతుందని తెలియజేయడం జరిగింది. పిల్లలందరూ కూడా బడిలో ఉండాలని పెద్దలందరికీ కూడా పనిలో ఉండాలని తెలియజేయడం తెలియజేశారు నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని అందరూ కూడా అమలు చేయాలని, మరియు పిల్లలందరూ ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.బాల్య వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఒక లక్ష రూపాయలు జరిమానా రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఇవి రెండు కూడా ఉంటాయని చెప్పడం జరిగింది. బాల్య వివాహానికి సహకరించిన వారి పైన కూడా కేసు నమోదు అవుతుందని తెలియజేయడం జరిగింది. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్న 100,1098కు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు.కార్యక్రమములో జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ మండల ఇంచార్జ్లాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, ఎంఈఓ రాముడు, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శివలీల, చైల్డ్ లైన్ సూపర్వైజర్ దస్తగిరి, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- టియుడబ్ల్యుజే (ఐజేయు) డైరి ఆవిష్కరించిన యెన్నం


టియుడబ్ల్యుజే (ఐజేయు) డైరి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, జనవరి 24 ప్రభాతవార్త :** సమాజంలో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యూజే ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన జర్నలిజం అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల వంటి సమస్యలపై సానుకూలంగా స్పందించారు.డైరీ ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్, సతీష్ రెడ్డి, మెహరాజ్, గోకులం వెంకటేష్, అనిల్, శివ, ఇతర జిల్లా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయి

**బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ**



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగు రావు నామాజీ

**నారాయణపేట, జనవరి 24 ప్రభాతవార్త:** గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలు నారాయణపేట ప్రజలను అబద్ధ హామీలతో మోసం చేశాయని, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగు రావు నామాజీ అన్నారు. శనివారం నారాయణపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి నారాయణపేట-మక్తల్ రహదారిని చూస్తే అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డికి చిట్టెం కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.శనివారం నారాయణపేటలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యానర్‌లో కేవలం మంత్రికే స్వాగతం పలికి,ఎంపీ డికె అరుణ పేరును ప్రస్తావించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నాంది అని అన్నారు. ఎమ్మెల్సీ ఫోటో లేకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని విమర్శించారు. వేదికపై పార్టీ నాయకులను కూర్చోబెట్టి, అదే వేదికపై కాంగ్రెస్‌పార్టీ చైర్మన్ పేరు ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పోలీసులు నిర్వహించిన రోడ్డు భద్రత కార్యక్రమానికి కేవలం కాంగ్రెస్ నాయకులను మాత్రమే ఆహ్వానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో సెక్షన్ 30 అమల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ర్యాలీ ఎలా నిర్వహించారని ప్రశ్నించారు.అధికారులు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల వ్యవహారంపై ఎస్పీ స్పందించాలని కోరారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత కే.రతంగ్ పాండు రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**నారాయణపేట, జనవరి24 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు నరహరి కార్మికులకు పిలుపునిచ్చారు.తెలంగాణ మున్సిపల్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో నారాయణపేట మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు శనివారం వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు నరహరి,మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి కె. సాయిలు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని మండిపడ్డారు. ఈ లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల 8గంటల పనిని 12గంటలకు పొడిగించి కార్మికులపై పని భారం మోపుతున్నారని విమర్శించారు. సామాజిక భద్రత కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో నారాయణపేట జిల్లాలో పని చేస్తున్న కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు యజమానులు తక్కువ జీతాలు చెల్లిస్తూ శ్రమను దోచుకుంటున్నారని అన్నారు.వెట్టిచాకిరి చేయిస్తున్నారని జీతాలుపెంచాలని కోరితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారని అసహనం వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26000 పిఎఫ్" ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు దయానంద్ రాజు, ఖతలప్ప, కడప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పీ మహేష్‌ను అభినందించిన ఎస్పీ

**నారాయణపేట, జనవరి 24 ప్రభాతవార్త:** ముంబై మారథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డీఎస్పీ మహేష్‌ను శనివారం ఎస్పీ డా.వినీత్ తన చాంబర్లో అభినందించారు. ముంబై మారథాన్-2026లో నారాయణపేట జిల్లా నుండి డిసిఆర్బి డీఎస్పీ మహేష్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరినట్లు తెలిపారు.టాటా ముంబై మారథాన్ (42.197 కిలోమీటర్లు) లాంగ్ రన్‌లో పాల్గొన్న ఆయన,5 గంటల 21 నిమిషాలు 30 సెకండ్లలో ఉత్తమ టైమింగ్‌తో మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసి రెండు మెడలు సాధించాడని హర్షం వ్యక్తం చేస్తూ మెడల్స్‌తో సత్కరించారు.ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధులతో పాటు శారీరక దృఢత్వం,క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం డీఎస్పీ మహేష్ ప్రత్యేకత అని అన్నారు. ఆయన సాధించిన విజయం యువతకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నిరంతర సాధనతో క్రీడల్లో ముందుకు సాగుతూ జిల్లాకు మంచి పేరుతీసుకువచ్చినందుకు డీఎస్పీ మహేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన ఈ ఘనవిజయం నారాయణపేట జిల్లా పోలీస్‌శాఖకు గర్వకారణమని, జిల్లాఅధికారులు, పోలీస్ సిబ్బంది, క్రీడాభిమానులు ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మారథాన్ రన్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లోపాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ నల్లపు లింగయ్య ముంబై మారథాన్‌లో రెండు మెడల్స్ సాధించిన డీఎస్పీ మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాలో సోషల్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ స్కీం సర్వే

**మొదటి పేజీ తరువాయి భాగం..**
విలేజ్ విజిట్ ప్రోగ్రామ్ ద్వారా ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎంపిక చేసిన నాలుగు గ్రామ పంచాయతీలలో ఆల్ ఇండియా సర్వీసెస్ బృందాలు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు స్థితిని పరిశీలించనున్నట్లు తెలిపారు.ఈ నెల 24వ తేదీ నుంచి ఉట్కూర్, దామరగిద్ద మండల కేంద్రాల్లో, నారాయణపేట మండలం సింగారం గ్రామంలో, మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో సర్వే నిర్వహిస్తారని చెప్పారు. అలాగే జనవరి 29 నుంచి 31 వరకు పేట మున్సిపాలిటీలోని నాలుగువార్డుల్లో సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. ఆల్ ఇండియా సర్వీసెస్ బృందాలు ప్రతి గ్రామం, వార్డుకు నలుగురు సభ్యుల చొప్పున వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా డీఆర్‌డీఓ మొగులప్ప వ్యవహరించనున్నారు.సమావేశంలో డా.హనుమంతు,ఉమ్మడిజిల్లా ట్రైనింగ్ మేనేజర్, ఆల్ ఇండియా సర్వీసెస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**
హక్కులను కేంద్ర ప్రభుత్వమైన బిజెపి కాలరాస్తే కాంగ్రెస్ పార్టీ మౌనంగా ఉండదని, గ్రామ, పట్టణ, ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్యం చేస్తూ ఉద్యమిస్తామన్నారు.గ్రామీణ ఉపాధి, సామాజిక న్యాయం కోసం పేదల పక్షాన మా పోరాటం ఉంటుందని అన్నారు. గతంలో ఉపాధి హామీ చట్టంలో కాంట్రాక్టర్లపై నిషేధంఉండేదనీ, బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో కన్వర్జెన్స్ పేరిట కాంట్రాక్టర్ల ప్రవేశంతో అవినీతి దోపిడీకి తెర తీశారన్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 100 సమర్థవంతంగా వ్యయం భారం భరించేది, కానీ బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో 60 కేంద్ర ప్రభుత్వం భరిస్తే.. 40రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం భరించాలని సూచించడం విడ్డూరం గుందన్నారు. వీబీ జీ రామ్ జీ చట్టంలో మొదటగా రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు ఇస్తే ..మిగతా 60 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వంద రోజులు పని దినాలలో పనిచేసిన వారందరికీ సమన్యాయంగా పని హక్కు కల్పించమన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో 125 రోజుల పరిధిలో కల్పిస్తామని ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తుందన్నారు. బిజెపి తెచ్చిన కొత్త చట్టంలో దళిత ఆదివాసి కుటుంబాలకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు.నిరుద్యోగ తీవ్రంగా పెరిగిందని, గ్రామీణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పెద్దగూడెం సర్పంచ్ పుష్పలత శివ కుమార్, ఉప సర్పంచ్ పోలికమ్మ, గ్రామ కాంగ్రెస్ నేతలు గుండాల రాములు, శేఖర్‌రెడ్డి,బుచ్చిబాబు,రొయ్యల శివయ్య, రవికుమార్, రమేష్, ఇసాక్, నాగన్న, మల్లేష్, పల్సర్ రాములు, వెంకటేష్, ఆంజనేయులు, కండక్టర్ ఆనంద్, వాల్యానాయక్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ , వార్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ఉపయోగార్థం కట్టిన ఎన్నో ప్రాజెక్టుల నుంచే నేటికి రైతులకు సాగునీరు అందుతుందని కేవలం కాలువలకు బొక్కలు పెట్టి మేము సాగునీరు తీసుకొచ్చామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లాఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు:** సీఎం రేవంత్‌రెడ్డి తన చిన్నతనంలో తిరిగి ఆడుకున్నటువంటి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లవేళల సహకారం అందిస్తామని వనపర్తి శాసనసభ్యులు తుడి మేగారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మేఘారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చి నెలలో స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కోటి రూపాయలు తన సొంత నిధులలో కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణంకోసం మిగిలిన నాలుగు కోట్ల రూపాయలను సీఎం విదేశీ పర్యటన ముగించుకుని రాగానే విడుదల అయ్యేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఆలయం 50 ఏళ్ల పూర్తిచేసుకునున్న సందర్భంగా చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నగనందం రఘునాథం తెలిపారు

## క్లియర్, సేఫ్ సిటీగా మార్చాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**
కూడా భారీగా తగ్గిందన్నారు.మత్తు పదార్థాలు, డ్రగ్స్ విషయంలో తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే నగరంలో పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగరంలో పటిష్టమైన చర్యలుతీసుకోవాలని, అవసరమైతే సిబ్బందిని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణతో పాటు వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించేలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సుందరీకరణ కమిటీ చైర్మన్ పోల శ్రీనివాసులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు లీడర్ రఘు, దేవేందర్ నాయక్, తిరుపతి నాయక్, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

